

# తోక పాత్రే — — —

## శ్రీ కే. వి. యల్. నరసింహారావు

సాయంకాలం అరుగంట లయినది. కలకత్తా నుంచి చెన్నపట్నం వెళ్లేమెయిలు వచ్చేటయిము కావచ్చింది. ప్లాటుఫారం మీద జనం కిటకిటలాడుతూ ఉన్నారు. ఇంతలో రయిలు స్టేషనుకు వచ్చింది. బండీలో ఎక్కడానికి అంతా హడావిడిగా పరుగులెత్తు తున్నారు. వెంకట్రావు కూతుర్నీ అల్లుడినీ చెన్నపట్నం సాగనంపడానికి ఖాళీగా వుండే కంపార్టుమెంటు కోసం తిరుగుతున్నాడు. ఇంతలో "అన్నగారూ అన్నగారూ" అంటూ సుమారు యాభైసంవత్సరాల కాయపారు మనిషి వెనుకనుంచి వెంకట్రావు చెయ్యి పట్టుకున్నాడు. ఆయన చటుక్కున వెనుకకు తిరిగి "ఏమిటీ! సుబ్బారావా! ఎక్కడనుంచి?" అంటూ తొందరగా ముందుకు నడుస్తూ "అమ్మాయీ అల్లుడూ చెన్నపట్నం వెడుతున్నారు, వాళ్లను రైలెక్కించి వస్తాను." అన్నాడు.

"ఇంకేం విమలను తీసికొని నేనూ చెన్నపట్నమే వెడుతున్నాను. వాళ్లుకూడా మా పెట్టెలో ఎక్కవచ్చును" అన్నాడు సుబ్బారావు.

"సరి సరి" అంటూ అతని వెంట వెళ్లి విమల కూర్చున్న కంపార్టుమెంటులో సరస్వతినీ అల్లుణ్ణీ ఎక్కించినాడు వెంకట్రావు.

"అమ్మా సరసూ మరచిపోయి నట్టున్నావు. ఈయన మీ అమ్మకు మేనత్తకొడుకు" అంటూ సుబ్బారావుగారి వంక తిరిగి

"విమలా ఇప్పుడు చెన్నపట్నం వెళ్లడంఎందుకు?"

"విమల ఇంట్లో ఊరికే కూర్చుంటే ఏమిలాభం. చెన్నపట్నం తీసికొనిపోయి సేవాసదనంలో ఏ ఫోర్తుఫారంలోనయినా చేర్పించి చదువు సాగిస్తూంటే ముందు సంగతి ఆలోచించ వచ్చుననుకుని బయలు దేరినాను."

వెం:—అయితే అత్తవారివల్ల విమలకు ఆస్తి ఏమైనా వచ్చిందా?

సుబ్బ:—ఆమాత్రం ఉంటే నాకీ ఆదుర్దా ఎందుకు? అయితే అడగడం మరచిపోయినాను—మీ అల్లుడికి చెన్నపట్నంలో ఉద్యోగమా ఏమిటి?

వెం:—అవును. అతను ట్రిప్లికేను హైస్కూలులో ఉద్యోగం. యం. ఏ. ప్రయివేటుగా చదివి పూర్తిచెయ్యవలెనని ప్రయత్నం.

సుబ్బ:—మీ అమ్మాయి చాలా నీరసంగా కనిపిస్తోందే!

వెం:—ఇప్పుడు దానికి అయిదవనెల. ఉంచమంటే అతను ఉంచడు. అది ఉండదు. ఏమంటే అతను ఇబ్బంది పడతాడంటుంది. ఏడవనెలలో పంపుతానన్నాడు.

సుబ్బ:—విమలను సేవాసదనంలో ప్రవేశపెట్టిన తరువాత దానికి దిక్కెవ్వరా అనుకున్నాను. దైవికంగా మీరు కనపడడమూ, మీవాళ్లుకూడా పట్నంలోనే వుండడమూ చూస్తే, భగవంతుడు వాళ్లనే దానికి దిక్కుగా ఏర్పాటు చేసినాడా అనిపిస్తోంది.

వెంకటరావుగారు కూతురువంక అల్లుడువంక చూచి "విమలభారమంతా మీదే, కాకినాడలో ఉన్న తండ్రి అన్నప్పుడల్లా విమల కక్కరకు రాడుగదా-(అంటూ విమల వంక చూస్తూ) నీవంటిపిల్లకు ఎంతగతి పట్టింది?" అంటూండగానే రయిలు బయలు దేరడమును గంట కొట్టినారు. వెంకట్రావు "అమ్మా సరసూ, రామారావూ! వెళ్లివస్తా. సరసూ దిగేటప్పుడూ జాగ్రత్తసుమా." అన్నాడు.

ఇంతలో రయిలు కదిలింది. చూస్తూండగానే ఒక్క క్షణంలో ప్లాటుఫారమంతా నిర్జనప్రదేశం అయిపోయింది. ఇదంతా వెంకట్రావుకు గొప్పవింతగా కనిపించింది. కాలగతిలో ఆకస్మికముగా కలిగే మార్పులూ ఇట్టివే కదా అనుకుంటూ ఇల్లు చేరినాడు.

౨

సుబ్బారావుగారు విమలను సేవాసదనంలో చేర్పించి కాకినాడ వెళ్లి పోయినారు. వెళ్లేటప్పుడు సరస్వతి రామారావులతో విమల పూచీఅంతా వారిమీద పెట్టి, వారింటికి ఆ అమ్మాయిని అప్పుడప్పుడూ పంపుతూ ఉండవలసిన దనిన్ని సేవాసదనం అధికారులకు చెప్పినాడు.

ఆదివారం రోజున, ఇతర సెలవు రోజులలోనూ విమలను సరస్వతీ రామారావులు తమఇంటికి తీసికొని వెడుతూ ఉండేవారు.

అనుకుంటూండగనే సరస్వతికి ఏడవమాసం వచ్చింది. వంట మొదలయిన పనులలో రామారావు కాస్త సహాయపడుతూ ఉండేవాడు. ఎప్పుడైనా విమల వచ్చినప్పుడు సరస్వతిని అసలేపని చేయనిచ్చేది కాదు. సమస్తమయిన ఇంటిపనులూ విమలే చక్కబెడుతూ ఉండేది.

ఆరోజు ఆదివారం విమల అక్కడనే ఉంది. వారం రోజులలో సరస్వతిని తీసికొని పోవడానికి అన్న మాధవరావు వస్తాడని రామారావుకు మామగారు ఉత్తరం వ్రాసినాడు. సరస్వతి పుట్టింటికి వెళ్లక తప్పదు. రామారావును విడిచిపెట్టి వెళ్లడానికి మనసొప్పదు. "అక్కా ఎందుకంత విచారంగా ఉన్నావు" అని విమల అడిగినది. "ఏముంది? ఆయనను ఒంటరిగా విడిచిపెట్టి ఏలా వెళ్లనా అనిపిస్తోంది. టిఫిన్ నేను పెడితే కద్దు. ఆయన అదగరు కదా! అన్నానికి ఎన్నోసార్లు పిలిస్తేగాని లేవనే లేవరు. ఇక నే వెళ్లిన తరువాత ఆయనకు అన్నంమీద టిఫిన్‌మీద అసలేధ్యానం ఉండదు" అన్నది సరస్వతి. ఇంతలో రామారావు అందుకుని "సరసూ! భార్య ఇంట లేనప్పుడు భర్త నిద్రాహారాలు వర్జించడమనేది సహజమే. కాని నేనుమాత్రం అంత పిచ్చివాడను కానుసుమా! రెండు పూటలా కాఫీహోటలుకు పోయి నీవంతు కూడా నేనే తిని వస్తాను. హోటలునుంచి వచ్చేభోజనం ఇద్దరికిసరిపోయేటంత ఉన్నప్పటికి, నీవు లేవనే బెంగచేత పరధ్యానంగా యీవత్తూ నిన్ను తలచుకుంటూ నీవంతు కూడా నేనేతింటాను" అన్నాడు. సరస్వతి నవ్వుతూ "విమలా చూచావా మీ బావగారి వేళాకోళాలు, అలా అంటారే గాని, నేను చెప్పినట్టే జరుగుతుంది, చూస్తావుగా" అన్నది. "అక్కా నీవు అనవసరంగా బెంగ పెట్టుకోకు, బావగారికి హోటలుభోజనం సరిపోకపోతే నేను ప్రతి ఆదివారం వచ్చి నీవు ఇక్కడ లేవనేలోటు ఆయనకు లేకుండా చేస్తాను సరికదా" అన్నది విమల. "ఇప్పుడు నీవలా అంటావే కాని నేను లేకపోతే నీవు వస్తావన్న మాటేమిటి?" అన్నది సరస్వతి. "తప్పకుండా వస్తానక్కా నామాట నమ్ము, ముమ్మాటికినమ్ము" అన్నది విమల. "అయితే సరే ఆయనను గురించిన బెంగ ఇక నాకు తీరింది." అన్నది సరస్వతి.

సాయంకాలం సరస్వతి టిఫిన్ తీసికొని వచ్చి రామారావు చదువుకుంటూంటే ప్రక్క "టీపాయి" మీద పెట్టి "చల్లారిపోతుంది త్వరగా తినండి కాఫీ తీసికొస్తాను" అంటూ లోపలికిపోయి, మరొక అయిదు నిమిషాలలో కాఫీ తీసికొని వచ్చింది. "టీపాయిమీద పెట్టిన టిఫిన్ టిఫిన్ లాగనే ఉందీ!" అన్నది సరస్వతి. 'నవలా' మగ్నమానసుడై ఉన్న రామారావు మాట్లాడనే లేదు. "పిలిస్తేకూడా మాట్లాడకుండా చదువుతున్నారు, అది ఏమిటి?" అన్నది. "ఏమిటా! ఈనవల నీవు చదివితే అసలే విడిచిపెట్టవు." అన్నాడు రామారావు. ఇంత కాలంనుంచి నవలలు చదవడమంటే మీకు విసుగు. నేను వెళ్లిన తరువాత మీఇష్టం. ఏదో నవలతో కాలక్షేపం చేస్తురుగాని లెండి. ఈపాటికి పుస్తకం మూసి కాస్త ఆ టిఫిన్ తిని కాఫీ తాగుదురూ" అన్నది. ఇంతలో

విమల లోపలిపని పూర్తిచేసి మిగిలిన టిఫిన్ కాఫీ తీసికొనివచ్చి వేళే బల్లమీద పెట్టింది. అవి విమలా సరస్వతులు పుచ్చుకున్నారు. ఆ సాయంకాలం ముగ్గురూ కలిసి సినీమాకు వెళ్లినారు. మరునాటి ఉదయం రామారావే విమలను సేవాసదనంలో దిగబెట్టి వచ్చాడు.

మరొకవారం జరిగింది. శనివారం రోజు సాయంకాలమే ఇద్దరూ పోయి విమలను తీసికొని వచ్చారు. ఆదివారం ఉదయం మెయిలులో మాధవరావు వచ్చినాడు. రాత్రి మెయిలులో సరస్వతిని తీసికొని వెళ్లకపోతే మరునాడు అమావాస్య—అందుచేత ఆరోజు ప్రయాణం తప్పలేదు. ఆరోజు సాయంకాలం రామారావుకు కాఫీ ఇస్తూ సరస్వతికంట నీరుపెట్టుకుంది. అదేమిటి సరసూ అంటూ రామారావు చేతిరుమాలుతో సరస్వతికళ్లు తుడిచినాడు. తప్పని సరిగా వెడుతున్నాను గాని, తిరిగి వస్తానో మనకు ఇవే ఆఖరు చూపులో అంటూ వంచిన తలపైకెత్తి ఒక్కసారి రామారావు దృష్టిలో తన దృష్టి కలిపేసింది.



“పాపం విమలకు తల్లిఇదివరకే పోయింది. తండ్రిరెండవ పెళ్లిచేసుకున్నాడు గదా. వెళ్లినవాడు తిరిగిచూడలేదు. దానికిమనమేగతి, నేను వెళ్లక తప్పదుగదా. దీని జీవితం ఏదో తోవలో మనమే పెట్టాలి. చెల్లెలులేని లోటునాకూ విమల తీర్చింది. దానికికల్లా కపటం తెలియదు. వట్టి అమాయకపు పిల్ల, మామూలు ప్రకారం ప్రతి ఆదివారం తీసికొనివచ్చి, దానికి కావలసి పాఠాలు చెప్పండి. మీకేమి కావలసినా వారానికి సరిపడ్డవి దానిచేత చేయించుకోండి. నేను లేకపోవడంవల్ల మీరేమి బాధపడుతున్నారో అనే బెంగ నాకేమీ లేకుండా చేయండి. ఆలా చేస్తానంటే మీ యిద్దరిని గురించీ నాకు దిగులు ఉండదు.” అన్నది సరస్వతి.

సరే నీవు చెప్పినట్లు అలాగే చేస్తాను సరిగద. ఇదంతా ఈ రెండు మూడు నెలలే కాని, పురుడు వెళ్లగానే నిన్ను తీసుకొని రానా?” అన్నాడు రామారావు. వీరి సంభాషణ అంతా వింటూఉన్న విమల “అక్కా ఏమీ బెంగ పెట్టుకోకుండా సంతోషంగా వెళ్లు, నీవు వెళ్లక తప్పదాయె” అన్నది. రాత్రి మెయిలుకు రామారావు విమలా కూడా స్టేషనుకు వెళ్లి సరస్వతీ మాధవరావులను సాగనంపి వచ్చినారు.

రెండు మాసాలు ఇదేవిధంగా వారం వారం విమల వస్తూ పోతూ ఉండేది. ఆదివారం విమల వచ్చినప్పుడు తాను చదివిన నవలలో విషయాలు చెప్పడం జరుగుతూ ఉండేది. వారం అంతా కొంత తోచకుండా ఉన్నప్పటికీ, ఆదివారం విమలవచ్చిన తరువాత ఖులాసాగా ఉండేది. సరస్వతి వెళ్లిన కొద్ది రోజులవరకూ ఏమీ తోచేదికాదు. సరస్వతిని పిలిచే అలవాటు చొప్పున

రామారావు అప్పుడప్పుడు విమలను "సరసూ—కాదు విమలా" అని పిలిచేవాడు. "సరి బాగానే వుంది. బావగారు నీకోసం అస్తమానం కలవరిస్తున్నారు, నీవెప్పుడు వస్తావో మరి "అని ఉత్తరం వ్రాస్తానులేండి" అని విమల రామారావుతో హాస్యమాడేది. ఉభయులూ నవ్వుకునేవారు, ఈలా కొంతకాలం గడిచింది.

## 3

కాలం ఇట్టే గడిచిపోతోంది. సరస్వతికి మగపిల్లవాడు పుట్టిన టెలిగ్రాము వచ్చింది. రామారావు భార్యను పిల్లవాడిని చూచి రావడానికయినా బయలు దేరనేలేదు.

ఒక ఉదయం కాకినాడనుంచి ఉత్తరంవచ్చింది. సుబ్బారావుగారు వారంరోజులు జ్వరంతో బాధపడి కాలం చేసినారని. విమలకు తండ్రితప్ప దిక్కు వేరెవ్వరూ లేరు. తండ్రి పోవడంవల్ల ఆమెను గురించిన బాధ్యత ఇప్పుడు రామారావుకు మరింత హెచ్చింది. ఏప్రిలు నెలాఖరు కావస్తూన్నది. ఇక రెండు రోజులలో వేసవికాలపు సెలవులకు సేవాసదనం మూస్తారు. బ్రతికి ఉన్నప్పుడే విమల భారమంతా తనమీద వేసినాడు. అందుచేత విమలకు అన్నిటికీ తానే దిక్కు అయినాడు. సేవాసదనం నుంచి సెలవులకు కాకినాడ తండ్రివద్దకు వెళ్లవలసిన విమలకు ట్రిప్లికేనులో రామారావు ఇల్లుతప్ప వేరుగతి లేకపోయింది.

ఇదివరకైనా విమలకు తండ్రి ఉన్నాడన్న మాటేకాని ఉన్నా లేక పోయినా ఒకటిగానే ఉండేది. కాని తల్లిలేని పిల్ల గనుక తండ్రి మరణంవల్ల కలిగిన దుఃఖం భరించలేకపోయింది. అట్టిసమయంలో రామారావు ఆదరణ విమల హృదయానికి, చాలా శాంతికలిగించింది. ఎప్పుడు దుఃఖించినా ఓదార్చవలసినవాడు అతనికంటె మరెవ్వరున్నారు? ఇంతలో ఒకరోజున సరస్వతి వద్దనుంచి ఒక ఉత్తరం వచ్చింది.

"సుబ్బారావు గారు పోయినందున విమలకు అన్నిటికీ మనమేగతి అయినాము. విమలచేత పనిపాటలు చేయించి బాధపెట్టక హోటలునుంచే భోజనం తెప్పించుకుంటూ కాలం గడపండి. బీచికో సినిమాకో తీసికొని పోయి తండ్రిపోయిన దుఃఖం కాస్త మరచిపోయే లాగ చేయండి" అని సరస్వతి వ్రాసిన దానిని, విమలకు చదివి వినిపించినాడు రామారావు.

మరునాడు ఇద్దరూ సినిమాకు పోయివచ్చినారు ఉభయులకూ ఏవేవో చిత్రమైన భావాలుతోచినవి. ఇంటికి వచ్చి భోజనముచేసి డాబాపైన వెన్నెట్లో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఆరోజు వెన్నెలవారికి మాములు వెన్నెలలాగ కనిపించలేదు. ఆ వెన్నెట్లో ఒకరిముఖం ఒకరికి నూతన కాంతిలో కనిపించింది. వారిదృష్టికి చంద్రుడు నక్షత్రములు నిర్మలమైన నీలాకాశము, ఇదీ అదీ అని ఏమిచెప్పగలము- సమస్తమైన ప్రకృతి సౌందర్యమూ ఒక విధమగు నూతన శోభపొందినట్లు కనిపించినది. ఇక చెప్పవలసిన దేమున్నది.

* * *

తెల్లవారింది. విమలముఖము వాడినట్టుంది, కాని ఆవాడడంలోనే ఒకశోభ లేకపోలేదు, ప్రపంచమంతా ఆమెకు మామూలువలెగాక క్రొత్తగా కనిపించింది. శబ్దమందొక నూతనమాధుర్యం స్పర్శయందొక నూతనసౌఖ్యం, చూచే వస్తువులయందొక నూతనకాంతి, తినేపదార్థములయందొక క్రొత్తరుచి, పుష్పములయందొక క్రొత్తపరిమళం కనిపించింది. కాని రామారావుతో మునుపటి చనవుతో మాట్లాడలేక పోయేది. కొంతభయం సిగ్గు కలిగింది. రామారావుకు అంతే. విమలకు రామారావు, రామారావుకు విమలాకూడా క్రొత్తగా కనిపించారు. ఏకార్యమూ, చేయడమే మానవుడివంతు గాని ఫలం ఎప్పుడూ ఈశ్వరాధీనమే. కోరుకున్న ఫలమే రాదు, కోరుకోనిదీవస్తుంది. చేసినకార్యం ఫలరూపం తాల్చింది. విమల మునుపటి విమల కాదు. రూపంలోకూడా మార్పు కలిగింది. బయటకు తరుచుగా వెళ్లడంమానేసింది. ఎప్పుడూ ఏదో దిగులుగా విచారంగాఉండేది. సరస్వతిని రమ్మని ఎలావ్రాస్తాడు? వద్దనిమాత్రం ఎలావ్రాస్తాడు? ఉపాయంతోచక ఊరుకున్నాడు. కొన్నాళ్లు ఊరుకోవడంతోటి దూరానున్న సరస్వతి మనస్సు పరిపరివిధాలపోయింది.

ఉదయం మెయిలులోదిగి సరస్వతి ట్రిప్లికేనుకు వచ్చింది. గుమ్మంముందర పిల్లవానితో సరస్వతిని చూచేసరికి రామారావూ విమలా తెల్లబోయినారు. ఇద్దరూకూడా చాలాప్రేమతో పిల్లవాడిని తీసికొని ముద్దాడినారు. కాని మాటలలో ఆ వెనుకటిచనవు, ధారాళంలేదు. సరస్వతికిది చాలా వింతగాతోచింది.

అంతా అర్ధమైపోయింది. విమల హృదయము అతికోమలము స్వచ్ఛము. ఇప్పటికి ఒకవిషయం కూడా సరస్వతిదగ్గర దాచలేదు. ఈ విషయం మాత్రం ఏలాదాస్తుంది? ఆ రోజు సాయంకాలం రామారావు బయటకుపోయి రాత్రి ఎనిమిదిగంటలవరకూ రాలేదు. సాయంకాలంవరకు విమల చంటిపిల్లవాడికి చేయవలసిన పనులన్నీ సరస్వతికి శ్రమకలగకుండా తానేస్వయముగా చేసింది. ఇద్దరూ గాలికోసం పిల్లవాడిని తీసికొని డాబామైకివెళ్లి కూర్చున్నారు. అప్పటికి కొంచెం చీకటి పడ్డది. ఆకాశంలో నక్షత్రాలు కనిపిచడం ప్రారంభించినవి. విమల, ముఖం చాలా చిన్నబుచ్చుకొని కూర్చున్నది. "అమ్మాయి విమలా, అలా ఉన్నావేమే" అన్నది సరస్వతి.

ఇంతలో రామారావు రాత్రి ఇంటికివచ్చినాడు అంతా. భోజనంచేసినారు. కొంచెముసేపు కబుర్లు చెప్పుకుని పడుకున్నారు. ఆ కబుర్లు మునుపటిలాగ హృదయ పూర్వకముగా ఎలాఉంటాయి! రాత్రి పరునారన్నమాటేగాని ఎవరికీ సరిగా నిద్రపట్టలేదు. ఏలాగయితే నేమి తెల్లవారింది.

సరస్వతి రూపంలోనూ ముఖంలోనూ గొప్ప మార్పు కలిగింది. చూపులోనూ మాటలోనూ గొప్ప వైరాగ్యభావం కనిపించింది. రామారావుకుమాత్రం ఆమె చూపులు హృదయి శోధకముగా ఉండడంచేత ఆతడు ఆమెముఖంచూడలేక పోయినాడు. స్వర్గలోకంలోనుంచి ఏదోపనిమీద భూలోకంవచ్చి తిరిగీ త్వరలో వెళ్లిపోదలుచుకున్న ఒక అలౌకికవ్యక్తిలాగ ఉండేది. ఇల్లంతా సర్దుకుని నాలుగు రోజులలో ఎక్కడికో ప్రయాణమయ్యే మనిషిలాగ కనిపించేది. ఏ వస్తువుచూచినా, ఏపని జేసినా, ఏమాటాడినా, ఒకవిధమైన పరధ్యానంకనిపించేది. ఒక రోజున తనకున్న నగలు బట్టలు అన్నీ విమలకు చూపించింది.

నాలుగురోజులలో మంచమెక్కింది. క్రమక్రమంగా ఆకలి మందగించింది. ఆహారం తగ్గిపోయింది. దానితోపాటు ఓపిక తగ్గిపోవడం మంచంలోనుంచి లేవలేకపోవడం తటస్థించింది. రామారావు తహతహలాడినాడు. ఇద్దరుముగ్గురు డాక్టర్లను తీసికొని వచ్చినాడు. వారు పరీక్షించిచూచి "జబ్బేమీ కనబడదూ గుండెమాత్రం చాలానీరసంగాఉంది, తరుచు కొంచకొంచం ఆహారం ఇస్తూఉండవలసినది" అని చెప్పినారు.

ఏదిచ్చినా సరస్వతి నవ్వుమొగంతో పుచ్చుకునేది. ఆ ముఖములో, ఎప్పుడూ ఒకవిధమైన మధురభావం కనపడేది. రెండు మూడు రోజులు పోయినతరువాత ఒక రోజు మధ్యాహ్నం, కంఠస్వరంకూడా తగ్గిపోయింది ఏదో చెప్పబోతూ ఆగి నాలుక తడువుకోవడముకు నీటికోసం సంజ్ఞ చేస్తూ, నీరు తెచ్చేలోపుగానే కళ్లు తిప్పేసింది.


చాలకాలవుంది　　మొదటిరకం　　సాటిలేదు

బాద్ షాహి

రోమ సంహారి సబ్బు

అందమయిన టిన్ను పెట్టెలో బిళ్లలు పెట్టి వున్నవి.

3 బిళ్లల పెట్టె కిమ్మతు ౧౨ అణాలు. ఖర్చులు ప్రత్యేకము

మంచి పరిమళము నిస్తుంది. ఎల్లప్పుడు దీన్ని వుపయోగించండి

సోలు ఏజంట్లు:—

**C. C. MAHAJAN & CO.,**

**281 Jumma Masjid, BOMBAY 2**

మద్రాసు వర్తకులు:—

జె. యం. సేట్

260 చైనాబజారు రోడ్డు, మద్రాసు